

నోరు లేని మేకల్నే బలి ఇస్తారు.
సింహాల్ని బలివ్వరు, గుర్తించుకోండి.
- డా. బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం ✍

www.Janaswaram.com

జనస్వరం న్యూస్ తెలుగు వారపత్రిక ద్వారా తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్నీ కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి.
మా మెయిల్ ఐడి : janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 9642067900

సంపుటి : 4 | సంచిక : 304 | ఎడిటర్ : నరేష్ సాకే | వార సంచిక : 18 - 05 - 2025 | పేజీలు : 6


# ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

**ఆగస్టు 15 కానుక: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం**
**కర్నూలు జిల్లా పాణ్యంలో సీఎం చంద్రబాబు వెల్లడి**
**ఈ నిర్ణయం మహిళా సాధికారతకు, ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని వెల్లడి**

**కర్నూలు, మే 17, జనస్వరం :** రాష్ట్రంలోని మహిళలకు శుభవార్త! ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గంలో నిర్వహించిన "స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ నిర్ణయం మహిళా సాధికారతకు, వారి ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "మా ప్రభుత్వం మహిళా పక్షపాతి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు, ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రంలోని ఆడబిడ్డలందరూ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇది వారికి మేము ఇచ్చే కానుక. ఈ పథకం అమలుకు సంబంధించిన విధివిధానాలను త్వరలోనే ఖరారు చేస్తాం" అని చంద్రబాబు సభాముఖంగా ప్రకటించడంతో సభికుల నుంచి పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూనే, రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తామని తెలిపారు. ఇప్పటికే 76 ప్రాజెక్టుల ద్వారా రూ.4.96 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, తద్వారా 4.51 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4 వేల నుంచి రూ.15 వేల వరకు పింఛన్లు అందిస్తున్నామని, అన్న క్యాంటీన్లతో పేదల ఆకలి తీరుస్తున్నామని అన్నారు. "దీపం-2" కింద మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తామని, పాఠశాలలు తెరిచేలోగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని, "తల్లికి వందనం" కింద రూ.15 వేలు జమ చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని భరోసా ఇచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలు అందించే లక్ష్యంతో 1998లో తాను ప్రారంభించిన రైతు బజార్ల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామన్నారు. ప్రస్తుతమున్న 125 రైతు బజార్ల సంఖ్యను పెంచుతామని, కర్నూలులోని రైతు బజార్ ఆధునికీకరణకు రూ.6 కోట్లు కేటాయిస్తామని తెలిపారు. పాణ్యం నియోజకవర్గంలో రూ.50 లక్షలతో ఉద్యానవన అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. అలాగే, నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.50 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. కర్నూలు జిల్లాలో ఇంటింటికీ సురక్షిత తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. 2029 నాటికి పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.



స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని, పర్యావరణ పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గంలో జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీ క్యాంప్ రైతుబజార్‌ను సందర్శించి రైతులు, పారిశుధ్య కార్మికులతో ముచ్చటించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, పలు కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా ప్రకటించారు. నెట్ జీరోకు రాష్ట్రంలో పర్యావరణాన్ని తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. గత ప్రభుత్వం పట్టణాల్లోనే 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వదిలేసి పోయిందని, అక్టోబర్ 2 నాటికి రాష్ట్రంలో చెత్త లేకుండా చేయమని మంత్రి నారాయణకు చెప్పానని చంద్రబాబు తెలిపారు. ఇప్పటి వరకూ 55 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త తొలగించారని, రోడ్డుపై చిన్న కాగితం ముక్క కూడా వేయకుండా బాధ్యతగా వ్యవహరించే దేశం జపాన్... మనమూ దీన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని కూకటివేళ్లతో పెకిలించామని గుర్తుచేసిన చంద్రబాబు, భవిష్యత్తులో కూడా సీమ గడ్డపై ఫ్యాక్షన్ అనే మాటే వినిపించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామని, మన ఇల్లు, పరిసరాలతో పాటు పల్లెలు, పట్టణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, విద్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సీఎం సూచించారు. వ్యర్థాల పునర్వినియోగం (రీసైక్లింగ్) ప్రాముఖ్యతను వివరించారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులను రాజమండ్రి, విజయవాడ, నెల్లూరు, కడపలోనూ ఏర్పాటు చేస్తామన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా గ్రామాల్లో ప్రజా చైతన్యం తీసుకురావాలని, చెత్త సేకరణ, కంపోస్ట్ తయారీ బాధ్యతలను వారికి అప్పగిస్తామని చెప్పారు. 'పల్లె పుష్కరిణి' కార్యక్రమం ద్వారా గ్రామాల్లో చెరువులను శుభ్రపరిచి, వాటి చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు నిర్మిస్తామన్నారు. 2026 మార్చి నాటికి రాష్ట్రాన్ని వంద శాతం ఓడీఎఫ్ ప్లస్‌గా మార్చడమే లక్ష్యమన్నారు.

# ప్రధాని మోదీ నుంచి సలహాలు తీసుకున్నా: మంత్రి లోకేశ్

**- నిన్న కుటుంబసమేతంగా ప్రధానిని కలిసిన మంత్రి లోకేశ్**
**- ఈ సందర్భంగా 'యువగళం' కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఆవిష్కరించిన మోదీ**
**- ఈ భేటీ అనంతరం 'ఎక్స్' వేదికగా లోకేశ్ పోస్ట్**

**ఢిల్లీ, మే 17, జనస్వరం :** ఏపీ విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ కుటుంబసమేతంగా శనివారంనాడు న్యూఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసిన విషయం తెలిసిందే. ఇటీవల ప్రధాని అమరావతి వచ్చిన సందర్భంలో ఢిల్లీ రావాలని మంత్రి లోకేశ్‌ను ఆహ్వానించిన సందర్భంగా ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 'యువగళం' కాఫీ టేబుల్ పుస్తకాన్ని ప్రధాని ఆవిష్కరించారు. 2024 ఎన్నికలకు ముందు లోకేశ్ చేపట్టిన 3,132 కిలోమీటర్ల పాదయాత్ర విశేషాలను ఈ కాఫీ టేబుల్ బుక్‌లో పొందుపరిచారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రధాని దానిపై సంతకం చేసి లోకేశ్‌కు అందజేశారు. ఇక, ఈ భేటీలో ప్రధాని మోదీ, లోకేశ్ దంపతుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుమారుడు దేవాన్ష్‌ను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని సరదాగా ముచ్చటించారు. మోదీతో భేటీపై లోకేశ్ ట్వీట్ : ప్రధాని మోదీతో భేటీ అనంతరం మంత్రి లోకేశ్ 'ఎక్స్' వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రధానిని కలిసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. "ఈరోజు గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో కుటుంబసమేతంగా కలవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. ఏపీ పురోగతికి ప్రధానమంత్రి అందించిన మద్దతుకు కృతజ్ఞతలు. జాతీయ భద్రత, దేశాభివృద్ధిలో ప్రధాని నిర్ణయాత్మక నాయకత్వానికి ధన్యవాదాలు. 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి చేరుకోవడంలో రాష్ట్రం దేశానికి ఏ విధంగా తోడ్పడాలో ప్రధాని నుంచి సలహాలు తీసుకున్నా" అని మంత్రి లోకేశ్ ట్వీట్ చేశారు. "ఈరోజు గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో కుటుంబసమేతంగా కలవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. ఏపీ పురోగతికి ప్రధానమంత్రి అందించిన మద్దతుకు కృతజ్ఞతలు. జాతీయ భద్రత, దేశాభివృద్ధిలో ప్రధాని నిర్ణయాత్మక నాయకత్వానికి ధన్యవాదాలు. 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి చేరుకోవడంలో రాష్ట్రం దేశానికి ఏ విధంగా తోడ్పడాలో ప్రధాని నుంచి సలహాలు తీసుకున్నా" అని మంత్రి లోకేశ్ ట్వీట్ చేశారు.



# త్వరలో కొత్త రూ.20 నోట్లు... ఆర్బీఐ ప్రకటన

దేశంలో మరోసారి కొత్త కరెన్సీ నోట్లు రానున్నాయి. మహాత్మా గాంధీ (కొత్త) సిరీస్ కింద త్వరలో కొత్త రూ.20 డినామినేషన్ నోట్లను విడుదల చేయనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రకటించింది. ఈ తాజా నోట్లపై ప్రస్తుత ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకం ఉంటుంది. అయితే కొత్త నోట్ల డిజైన్, ఫీచర్లు ప్రస్తుతం చెలామణిలో ఉన్న నోట్ల మాదిరిగానే ఉంటాయని తెలిపింది. నోట్ల రంగు, కొలతలు, సెక్యూరిటీ ఫీచర్లు, వెనుక వైపు ఉండే ఎల్లోరా గుహల చిహ్నం అన్నీ అలాగే ఉంటాయి అని చెప్పింది. ఈ మేరకు సెంట్రల్ బ్యాంకు ఒక నోటిఫికేషన్‌లో తెలిపింది. గతంలో జారీ చేసిన అన్ని రూ.20 నోట్లు, జారీ చేసే గవర్నర్ సంతకంతో సంబంధం లేకుండా పూర్తిగా చెల్లుబాటు అవుతాయని ఆర్బీఐ వెల్లడించింది. కొత్త గవర్నర్ సంతకంతో కొత్త నోట్లను జారీ చేయడం అనేది ఆర్బీఐ అధినాయకత్వం మార్పు తర్వాత సాధారణంగా జరిగే ప్రక్రియేనని, ఇది ప్రస్తుత కరెన్సీ నోట్ల వినియోగం లేదా విలువను ప్రభావితం చేయదని తెలిపింది.



# పనిలో పనిగా... బంగ్లాదేశ్‌పైనా ఆంక్షలు!

**- బంగ్లాదేశ్‌కు బిగ్ షాక్ ఇచ్చిన భారత్**
**- బంగ్లా వస్తువుల దిగుమతులపై భారత్ పోర్టు ఆంక్షలు**
**- నోటిఫికేషన్ విడుదల చేసిన డీజీఎఫ్‌టీ**

భారత్ బంగ్లాదేశ్‌కు బిగ్ షాక్ ఇచ్చింది. బంగ్లాదేశ్ నుంచి దిగుమతి అయ్యే రెడీమేడ్ దుస్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు సహా ఇతర వస్తువులపై భారత్ ఆంక్షలు విధించింది. ఈ మేరకు వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్టీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. తాజా నోటిఫికేషన్ ప్రకారం బంగ్లాదేశ్ నుంచి రెడీమేడ్ దుస్తులను కోల్‌కతా, నవా షెవా ఓడరేవుల ద్వారా మాత్రమే అనుమతించనున్నారు. అలాగే ఈశాన్యంలోని ల్యాండ్ ట్రాన్సిట్ పోస్టుల నుంచి కూడా పలు వస్తువుల దిగుమతిని నిషేధించింది. వీటిలో రెడీమేడ్ దుస్తులు, ప్రాసెస్డ్ ఫుడ్, ప్లాస్టిక్, ఫర్నిచర్, కార్బోనేటేడ్ పానీయాలు ఉన్నాయి. ఈ వస్తువులను మేఘాలయ, అసోం, త్రిపుర, మిజోరం, పశ్చిమ బెంగాల్‌లోని ఫుల్‌బారి, చంగ్రబంధలోని ల్యాండ్ కస్టమ్స్ స్టేషన్లు, చెక్ పోస్టుల ద్వారా భారత్‌లోకి అనుమతించరు. అయితే, ఈ ఆంక్షలు భారత్ గుండా భూటాన్, నేపాల్‌లకు రవాణా చేసే బంగ్లాదేశ్ వస్తువులకు వర్తించవు. బంగ్లాదేశ్ ఇప్పటి వరకు తన వస్తువులను భారత్‌లోని ఈశాన్య ప్రాంత మార్కెట్లకు ఎటువంటి పరిమితులు లేకుండా ఎగుమతి చేస్తోంది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా మహ్మద్ యూనస్ బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇంతకు ముందు యూనస్ చైనా పర్యటనలో ఉన్న సమయంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బంగాళాఖాతానికి బంగ్లాదేశ్ రక్షకుడని, భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలు ల్యాండ్ లాక్డ్‌గా ఉన్నాయని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో బంగ్లాదేశ్‌కు ఇస్తున్న ట్రాన్స్ షిప్‌మెంట్ సౌకర్యాన్ని భారత్ రద్దు చేసింది.

## జీవితం - వి "చిత్రం"




## ఈరోజు పంచాంగం వేళలు

తేదీ : 18 మే 2025
తిథి : శుద్ధ విదియ ( మ : 2.01 వరకు )
నక్షత్రం : ధనిష్ట ( తె 5.52 వరకు )
బ్రహ్మముహూర్తం : తె 5.16 నుండి తె 6.01 వరకు
రాహుకాలం : ఉ 11.08 నుండి మ 12.33 వరకు
యమగండం : మ 3.24 నుండి సా 4.49 వరకు
వర్జ్య కాలం : మ 12.37 నుండి మ 2.17 వరకు

## ఈరోజు నమాజ్ వేళలు

తేదీ : 18 మే 2025
ఫజర్ : 5.35 ఉదయం
సూర్యోదయం : 6.48 ఉదయం
జొహర్ : 12.34 మధ్యాహ్నం
అసర్ : 3.52 సాయంత్రం
మఘ్రిబ్ : 6.19 సాయంత్రం
ఇష : 7.32 సాయంత్రం







# జగన్ లో ఇంకా ఆ నమ్మకమే ఉన్నట్లుందిగా ???

## ఎడిటోరియల్

వైసీపీ అధినేత, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి త్వరలో పాదయాత్ర చేయబోతున్నారట. ఈ విషయాన్ని వైసీపీ నేతలే చెబుతున్నారు. అయితే, అప్పుడే కాదు లెండి.. ఇంకాస్త సమయం వుంది. 2027లో పాదయాత్ర వుంటుందన్నది వైసీపీ శ్రేణులు చెబుతున్నమాట. కాస్త ముందుగానే.. అంటే, 2026 చివర్లో పాదయాత్ర ప్రారంభించే అవకాశాలూ లేకపోలేదుట. ఎందుకీ పాదయాత్ర.? అంటే, గతంలో తనకు పాదయాత్రే అధికార పీఠాన్ని ఇచ్చిందని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బలంగా విశ్వసిస్తున్నారు గనుక. నారా లోకేష్ పాదయాత్ర, టీడీపీకి అధికారం తెచ్చిందని కూడా వైసీపీ పరోక్షంగా అంగీకరించక తప్పని పరిస్థితి. అంతకు ముందు, చంద్రబాబు కూడా పాదయాత్ర చేసే అధికారంలోకి వచ్చారు. చంద్రబాబు కంటే ముందు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, పాదయాత్ర ద్వారానే, అధికార పీఠమెక్కారు. సరే, పాదయాత్ర చేసే హక్కు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వుంది. ఇందులో ఇంకో మాటకు తావు లేదు. పైగా, పాదయాత్ర ఆయనకు అలవాటే. కానీ, ఒకప్పటి పాదయాత్రలకీ, ఇప్పటి పాదయాత్రలకీ చాలా తేడా. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2019 ఎన్నికలకు ముందు చేసిన పాదయాత్ర కూడా, 'మార్నింగ్ వాక్.. ఈవినింగ్ వాక్' అన్నట్లే వుండేది. అక్రమాస్తుల కేసులో కోర్టు యెదుట వ్యక్తిగత విచారణకు హాజరవ్వాల్సి వున్న వైఎస్ జగన్, దాన్ని తప్పించుకునేందుకు పాదయాత్ర చేశారన్నదీ కాదనలేని వాస్తవం. ఈసారి కూడా అంతేనా.? అంటే, దీనిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇదిలా వుంటే, పాదయాత్ర అంటే బోల్డన్ని



ఖర్చులుంటాయి. కొంత ఖర్చు పార్టీ పెడితే, ఇంకొంత ఖర్చు స్థానిక నాయకులు పెట్టుకోవాలి. ఇక్కడే, వైసీపీ నేతలు గుస్సా అవుతున్నారు. 2024 ఎన్నికల్లో వైసీపీ నాయకులు తీవ్రంగా నష్టపోయిన మాట వాస్తవం. వై నాట్ 175 అని వైఎస్ జగన్ చెబితే, గుడ్డి నమ్మేసి, అవసరానికి మించి ముందుగా ఖర్చు చేసేసి, చేతులు కాల్చుకున్నారు వైసీపీ నేతలు. ఎన్నికల్లో ఓడిపోయాక, మరిన్ని ఆర్థిక ఇబ్బందులు వైసీపీ నేతల్ని వెంటాడుతున్నారు. ఈ నేపథ్యంలో పాదయాత్ర అంటేనే, ఖర్చు దండగ వ్యవహారం.. అనేస్తున్నారట వైసీపీలో. మరీ, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు చెందిన వైసీపీ నేతలు, 'ఖర్చు మా వల్ల కాదు' అని అధినాయకత్వానికి ఆల్రెడీ తేల్చి చెప్పేశారన్నది ఇన్‌సైడ్ సోర్సెస్ నుండి అందుతున్న సమాచారం.

# కూటమి పరిపాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు

**- అభివృద్ధి - సంక్షేమం రెండు కళ్లుగా సుపరిపాలన**
**- స్వచ్ఛ భారత్ - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి**

**గుంటూరు, మే 17 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** గత ఐదేళ్ల వైసీపీ దుర్మార్గ పాలన నుంచి విముక్తి పొందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జననేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు తమ పారదర్శక, జవాబుదారీ పాలనతో సర్వతో ముఖాభివృద్ధి దిశగా ముందుకు తీసుకువెళ్తున్నారని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఆయన తెలిపారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా శనివారం 22 వ డివిజన్ పరిధిలోని శ్రీనివాసరావుతోటలో అధికారులు, పారిశుధ్య కార్మికులు, స్థానిక సిబ్బందితో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందన్నారు. ప్రతీ నెల మూడో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా జరిగిన




ర్యాలీలో అధికారులు వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఎదురైనా స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్లో డాక్టర్ లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు షేక్ ఆదం, చింతకాయల సాయి, బియ్యం శ్రీను, ప్రసాద్, ఖాసీం, బీజేపీ నాయకులు అప్పిశెట్టి రంగా, జూపూడి భవాని, నోడల్ ఆఫీసర్ చెన్నంశెట్టి లీలకుమారి, సానిటరీ ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి, సచివాలయం సిబ్బంది వరలక్ష్మి, లింగయ్య, ప్రభు, దివ్య, బ్రాహ్మణి, అనూష, మౌనిక, జాన్ వేస్లీ, తిరుపతమ్మ, సుజాత, సుహాసిని, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# "ఆపరేషన్ సింధూర్" శత్రు దేశాలకు గట్టి హెచ్చరిక లాంటిది

**- విజయవంతంగా భారత సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ**
**- పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నేతృత్వంలో ప్రజల విస్తృత స్పందన**

**పుట్టపర్తి, మే 17 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** భారత భద్రతా దళాలు విజయవంతంగా నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ దేశ భద్రతను ఉద్ధరించిన ఘనకార్యమని, ఈ యుద్ధ కార్యాచరణ శత్రు దేశాలకు గట్టి హెచ్చరికలాంటిదని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని శుక్రవారం సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, జిల్లా ఎస్పీ విరత్నతో పాటు స్థానిక కూటమి పార్టీల నేతలు, ప్రభుత్వ అధికారులు, వివిధ సంఘాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ సత్యమ్మ గుడి నుంచి సాయి మా హోటల్ వరకు సాగింది. ర్యాలీ సందర్భంగా "వందేమాతరం", "భారత్ మాతాకీ జై" వంటి నినాదాలతో పుట్టపర్తి వీధులు మారుమోగాయి. అమరవీరులకు జోహార్లు తెలిపి జాతీయ గీతాలాపన, జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే సింధూర రెడ్డి మాట్లాడుతూ, "ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత ఆర్మీ శక్తిని ప్రపంచానికి చాటింది. దేశ భద్రత విషయంలో మన సైనికులు రాజీ పడరని, పహల్గాం తరహా ఘటనలు పునరావృతమైతే మరోసారి ఇలాంటి




ఘాటైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆమె మాట్లాడుతూ "ఈ తిరంగా ర్యాలీ త్రివిధ దళాలకు మద్దతుగా నిర్వహించాం. ఉగ్రవాదంపై పోరాటంలో మన రక్షణ దళాలు చూపుతున్న సాహసాన్ని గర్వంగా ప్రశంసిస్తున్నాం. ప్రపంచం గర్వించే రక్షణ కవచం మనకు మాత్రమే ఉంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శేఖర్, లాయర్ హరికృష్ణ, జ్యోతి ప్రసాద్, రామాంజినేయులు, సూర్యనారాయణ, నారాయణ్, జనసేన నేతలు పత్తి చంద్రశేఖర్, అబ్దుల్లా, టీడీపీ నేతలు బోయ రామాంజినేయులు, సామకోటీ ఆదినారాయణ, రామారావు, లక్ష్మీపతి, గంగాధర్ నాయుడు, బీసీ గంగన్న, బెస్త చలపతి, సుభచంద్ర, సురేష్ చౌదరి, కృష్ణ ప్రసాద్, మహమ్మద్ రఫీ, ఓబులేసు, మాల మనోహర్, ఉమాపతి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# సహస్ర హాస్పిటల్ లో ఉచిత వైద్య శిబిరం

**- డాక్టర్ ఊకా శబరిష్**

**తిరుపతి, మే 17 (జనస్వరం) :** ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవ సందర్భంగా శనివారం హైపర్ టెన్షన్ పై అవగాహన కార్యక్రమం సహస్ర హాస్పిటల్ డాక్టర్ శారద, డాక్టర్ శభరీష్ నిర్వహించారు. రోగులకు రక్తపోటు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఊకా శభరీష్ మాట్లాడుతూ హైపరటెన్షన్ అనేది రక్తం ధమనుల్లో అధిక ఒత్తిడితో ప్రవహించే పరిస్థితి. ఇది ప్రారంభంలో లక్షణాలు లేకుండా శరీరాన్ని నెమ్మదిగా దెబ్బతీస్తుంది. ఇది గుండెపోటు, పక్షవాతం, కిడ్నీ వైఫల్యం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని తెలిపారు. 140/90 కంటే ఎక్కువ రక్తపోటు ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధిక ఉప్పు, బరువు, వ్యాయామం లేకపోవడం, మద్యం, ఒత్తిడి ఇవన్నీ కారణాలు అని, సరైన ఆహారం, వ్యాయామం, నిరంతర పరీక్షలతో హైపరటెన్షన్‌ను నియంత్రించవచ్చునని వెల్లడించారు. రక్తపోటును తరచూ తనిఖీ చేయండి.




ఆరోగ్యాన్ని కాపాడుకోండని ప్రజలకు సూచించారు. ప్రపంచ అధిక రక్తపోటు దినం సందర్భంగా 7 రోజులు ఉచిత వైద్య శిబిరం 23వ తేదీ వరకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

# జనసేన యువనేత జామి అనిల్ ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ

**- లోవిదిలక్ష్మిపురం సచివాలయంలో పేదల కోసం ప్రత్యేక శ్రద్ధ**

**లోవిదిలక్ష్మిపురం, మే 17 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** కూటమి ప్రభుత్వం చేపట్టిన కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో, జనసేన పార్టీ యువనేత జామి అనిల్ ఆధ్వర్యంలో లోవిదిలక్ష్మిపురం సచివాలయం పరిధిలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ జరుపుతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జామి అనిల్ స్వయంగా పాల్గొని, స్థానిక పేద ప్రజలకు దరఖాస్తు ప్రక్రియను వివరించి, సాయం అందించారు. రేషన్ కార్డు లేని కుటుంబాలు, కొత్తగా సభ్యుల యాడింగ్ అవసరమున్న కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జామి అనిల్ మాట్లాడుతూ, "పేదలకు రేషన్ కార్డు అనేది చాలా కీలకం. ఈ అవకాశాన్ని ఎవ్వరూ కోల్పోకూడదు. సచివాలయ



సిబ్బంది అందరితో కలిసి సహకారంతో ఈ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తిచేస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు. పేదల సంక్షేమానికి జామి అనిల్ తీసుకుంటున్న చొరవకు స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు.

# బి.వి.రామ్‌పై దాడి పట్ల కలకలం

**- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు**
**- ప్రశ్నించినందుకే ప్రాణాపాయం... విశాఖలో ఉద్రిక్త పరిస్థితులు**

**విశాఖపట్నం, మే 17 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ పై గాజువాకలో జరిగిన దాడి ఘటనపై రాజకీయంగా తీవ్ర దుమారం రేగుతోంది. ఈ దాడికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యథాశక్తిగా సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీ లోపల నుంచే విమర్శలు వస్తుండటంతో టీడీపీలో అంతర్గత సంక్షోభం తెరపైకి వచ్చింది. బీజేపీ ఫ్లోర్ లీడర్, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు తో శనివారం సమావేశమైన బి.వి.రామ్ తనపై జరిగిన దాడిని వివరించారు. టీడీపీ అధినేత చంద్రబాబుపై తనకు అత్యంత విశ్వాసమున్నప్పటికీ, పార్టీలో కొందరు నేతల దుర్మార్గ చర్యలతో తన ప్రాణం మీదకు వచ్చినట్టు పేర్కొన్నారు. "పల్లా శ్రీనివాసరావు వెనకేసి నన్ను మట్టుబెట్టే ప్రయత్నం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదుకాకపోవడం విషాదకరం, ఇది ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ" అని బి.వి.రామ్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే మాజీ వైసీపీ ప్రభుత్వ హయాంలో డా.సుధాకర్ పై జరిగిన ఘటనను ఉదహరిస్తూ – "ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంలో కూడా అలాంటి దుష్ట చర్యలు జరగడం కలవరపాటుకు గురిచేస్తోంది" అని విశాఖ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పి.విష్ణుకుమార్



రాజు మాట్లాడుతూ "ప్రజాస్వామ్యంలో ఎవరైనా ప్రశ్నించగలరు. దానిపై దాడులు చేయడం చాలా తప్పు. ఇది మన్నించరాని చర్య" అని తెలిపారు. ఘటనపై నిష్పక్షపాత విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, పోలీసులు ఇప్పటివరకు బి.వి.రామ్ ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో, పోలీస్ కమిషనర్ డా.శంఖ బాగ్చీ స్పందించాలని, కేసు నమోదు చేసి దౌర్జన్యానికి పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. విశాఖలో టీడీపీకి అనుకూలంగా నిలిచే కార్యకర్తలపై ఈ విధంగా దాడులు జరగడం, పార్టీ లోపల విభేదాలు తీవ్రంగా బయటపడడం ప్రస్తుతం రాజకీయ చర్చనీయాంశంగా మారింది.

# ఏలూరు అగ్రికల్చర్ మార్కెట్ యార్డు నూతన కమిటీకి ఘన స్వాగతం

**- రైతు సంక్షేమానికి బలమైన అడుగు**

**ఏలూరు, మే 17 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఆసియాలోనే అతి పెద్దదైన ఏలూరు అగ్రికల్చర్ మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. నూతనంగా ఏఎంసీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మామిళ్లపల్లి పార్థసారధి శక్తివంచన లేకుండా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మూడు పార్టీల కలయికలో ఏర్పాటైన బలమైన కమిటీ, మార్కెట్ యార్డు అభివృద్ధికి కొత్త దిశగా మారుతుందన్న విశ్వాసం వ్యక్తమైంది. ఈ సందర్భంగా ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పార్థసారధి తన స్వగృహం నుండి శోభాయాత్రగా వచ్చి, వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. వైస్ ఛైర్మన్ నడపన వాణి సూర్య కుమారి సహా డైరెక్టర్లతో కూడిన నూతన కమిటీ అధికారికంగా బాధ్యతలు స్వీకరించింది.

**వ్యవసాయ మార్కెట్‌కు దిక్సూచి చేయాలనే లక్ష్యం :**

ఈ సందర్భంగా మాట్లాడిన బడేటి చంటి మాట్లాడుతూ, "రైతు బిడ్డగా పార్థసారధికి రైతుల బాధలు తెలుసు. ఆయన నేతృత్వంలో మార్కెట్ యార్డు అన్ని అంశాల్లో ముందంజ వేయడం ఖాయం," అని అన్నారు. గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ, "జిల్లాలోని అన్ని ఏఎంసీలకు ఈ యార్డు మార్గదర్శకంగా మారాలి," అని ఆకాంక్షించారు.

**ప్రాధాన్యతల జాబితాలో మరుగుదొడ్లు, జింబో షెడ్ :**



యార్డు సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుంటానని పార్థసారధి స్పష్టం చేశారు. హమాలీలకు మరుగుదొడ్ల నిర్మాణాన్ని ఈ సంవత్సరం లోపల, జింబో షెడ్ నిర్మాణాన్ని 2026 నాటికి పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. "రైతులకు అసలు సమస్యలే లేకుండా చేయడమే నా లక్ష్యం," అని అన్నారు.

**రాజకీయాలకన్నా రైతు సంక్షేమమే ప్రథమం :**

మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వంలో సామర్థ్యాలు ఉన్నవారికి పదవులు లభిస్తున్నాయి. ఇది అభివృద్ధికి అద్దంపట్టే దృక్కోణం," అన్నారు. ఆర్టీసీ చైర్మన్ అప్పల నాయుడు, ఈడా చైర్మన్ శివప్రసాద్, పలువురు కార్పొరేటర్లు, సంఘాల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నూతన కమిటీ కార్యాచరణతో ఏలూరు మార్కెట్ యార్డు రైతుల అవసరాలకు మరింత సమర్థవంతంగా నిర్వహిస్తుందన్న నమ్మకం వ్యాప్తి చెందుతోంది.

# "ఆపరేషన్ సింధూర్" చరిత్రలో నిలిచిపోతుంది

**"తిరంగ యాత్ర"లో అన్ని వర్గాల ప్రజల అనేకం**

**అనంతపురం, మే 17 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** భారత త్రివిధ దళాల సాహసం, భారత దేశపు మతసహిష్ణుతను ప్రపంచానికి చాటిచెప్పిన "ఆపరేషన్ సింధూర్" విజయాన్ని పురస్కరించుకొని, అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో కూటమి ఆధ్వర్యంలో ఓ విస్తృతమైన తిరంగ యాత్ర ఘనంగా నిర్వహించబడింది. ఈ యాత్రలో కూటమి ఉమ్మడి అనంతపురం జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, చైర్మన్లు, ప్రభుత్వ అధికారులు, అన్ని రాజకీయ పార్టీల ప్రముఖులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రత్యేకంగా, జనసేన అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు లాయర్ కుంటిమద్ది జయరాం రెడ్డి చొరవ తీసుకొని యాత్రను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లాయర్ కుంటిమద్ది జయరాం రెడ్డి మాట్లాడుతూ"మన భారత త్రివిధ దళాల ధైర్యాన్ని, సేవను గుర్తించి ప్రపంచానికి పరిచయం చేసిన ఆపరేషన్ సింధూర్ విజయానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, మిలటరీ సైనికులకు మనఃపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఇది దేశగౌరవాన్ని ప్రపంచంలో విస్తరించిన ఘట్టంగా నిలిచిపోతుంది," అని అన్నారు. యాత్రలో పాల్గొన్న ప్రజలు జాతీయ పతాకాన్ని ఊపుతూ, దేశభక్తి నినాదాలతో వాతావరణాన్ని దేశభక్తిమయంగా మార్చారు.



# పేదల ఆకలి తీర్చడమే కూటమి లక్ష్యం : బీజేపీ

**పులివెందుల మే 17 (జనస్వరం) :** పేదల ఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ నాయకులు కేతిరెడ్డి తిరుపాల్ రెడ్డి, రాజులు తెలిపారు. పట్టణ పరిధిలోని అన్నా క్యాంటీన్ ను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ మార్క్ఫెడ్ డైరెక్టర్ వంగల శశి భూషణ్ రెడ్డి ఆదేశాల మేరకు తాము అన్నా క్యాంటీన్ ను సందర్శించామన్నారు. ఇక్కడ వంటకాలు అద్భుతంగా ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తోమంది పేదలు అన్నా క్యాంటీన్ ద్వారా కడుపు నింపుకుంటున్నారన్నారు. ఎవరికి ఏ ఒక్కరికి లోటు లేకుండా తక్కువ కాకుండా నింపాదిగా వంటలు వడ్డిస్తున్నారని పేర్కొన్నారు. క్యాంటీన్ పట్ల పేదలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారని వారు వెల్లడించారు.



# పారిశుధ్యంపై దృష్టి పెట్టండి : డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

**పులివెందుల మే 17 (జనస్వరం) :** వేంపల్లి పంచాయతీ పారిశుధ్యం పై దృష్టి పెట్టండి, ప్రజలను రోగాల బారి నుండి కాపాడండి అని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి, పులివెందుల అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువ కుమార్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆ మేరకు వేంపల్లి గ్రామ పంచాయతీ పాలక మండలికీ, పంచాయితీ రాజ్ అధికారులకు, పంచాయితీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కు, ముఖ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో వున్న వేంపల్లి గ్రామ పంచాయతీ మేజర్ పంచాయితీ.దాదాపు 50 వేల జనాభా వుంటుందన్నారు. కొంత కాలంగా వేంపల్లిలో పారిశుధ్యం పడకేసిందని, అధ్వాన్నంగా తయారైందన్నారు. కాంట్రాక్టు పారిశుధ్య సిబ్బంది 78 మంది వున్నారు. వీరికి 5 నెలలుగా జీతాలు యివ్వడం లేదని, అందువల్ల పారిశుధ్య సిబ్బంది తమ విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదన్నారు. జీతాలు యివ్వని కారణంగా పంచాయితీ పాలక మండలికీ, అధికారులకు పారిశుధ్య సిబ్బంధి చేత విధులు నిర్వహింపచేసే నైతిక అర్హత కోల్పోయారన్నారు. పర్యవసానంగా గ్రామం లో పారిశుధ్యం అద్వాన్నంగా తయారయిందని, మురుగు నీటి కాలువలు చెత్తా చెదారం తో పూడి పోయాయన్నారు. మురికి నీరు రోడ్ల పై ప్రవహిస్తోందని.రోడ్ల మీద ఎక్కడ చూచినా మురికి నీరు, చేత కుప్పలే దర్శన మిస్తున్నాయన్నారు. పందులు, కుక్కలు, ఆవులు, దోమలతో ప్రజలు సహజీవనం గడుపుతున్నారని తెలిపారు. మలేరియా, డెంగ్యూ, అతిసార, టైఫాయిడ్ తదితర అంటు వ్యాధులు విజృంభించాయన్నారు. పంచాయితీకి ప్రధాన ఆదాయ వనరు మార్కెట్ టెండర్ మార్చి 31 కి టెండర్ గడువు ముగిసిందని, మళ్ళీ టెండర్ వేయలేదన్నారు. అపరిశుభ్ర వాతావరణంలో దుమ్ము, దూలితో మార్కెట్ ప్రాంతం వుందని, రూ.1.40 కోట్ల తో నిర్మించిన రైతు బజార్ శాఖల మధ్య సమన్వయం లేక ప్రారంభానికి నోచుకోలేదన్నారు. పై సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు పోయి పరిష్కరించాలన్న ఉద్దేశంతో శనివారం కాంగ్రెస్ నాయకులు స్వచ్ఛంద పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. పార, పరక చేత పట్టారు. గతంలో ఎప్పుడూ ఇంత అద్వాన్నంగా లేదని తులసి రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర అని గొప్పలు చెప్పడమే తప్ప ఆచరణలో శూన్యం అని ధ్వజమెత్తారు. వెంటనే కాంట్రాక్ట్ పారిశుధ్య సిబ్బందికి జీతాలు చెల్లించాలని, వారి చేత విధులు సక్రమంగా నిర్వర్తింప చేయాలని



తులసి రెడ్డి,ధ్రువ కుమార్ రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామ కృష్ణ,చక్రాయపేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయ రెడ్డి, వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్, పెండ్లి మర్రి మండల శాఖ అధ్యక్షుడు మహబూబ్ బాషా, అమర్ నాథ్ రెడ్డి,ఉత్తన్న,బద్రి,వేమయ్య,వేమా రాజా, నాగరాజు, రమణ, వినయ్, రవి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# సగిలి బసిరెడ్డి నేత్రదానం



**పులివెందుల, మే 17 (జనస్వరం) :** పట్టణంలోని సగిలి బసిరెడ్డి (79) శనివారం మరణించడంతో ఆయన కుమారులు శ్రీధర్ రెడ్డి, శశిధర్ రెడ్డి, కోడళ్ళు అనిత, శిరీష, మనవల్లు, మనవరాళ్లు యశ్వంత్, శ్రీనిజ, కౌశిక్, తన్వి లు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజులకు సమాచారం ఇచ్చారు. దీనితో టెక్నీషియన్ హరీష్ తో కలిసి మృతుని నివాసం నందు పార్థివ దేహం నుండి సేకరించిన కార్నియా లను మునిసిపల్ ఇన్ ఛార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, మృతుని కుటుంబ సభ్యుల చేతులమీదుగా నేత్ర సేకరణ కేంద్రం సిబ్బందికి అందజేశారు. ఆ కార్నియాలను హైదరాబాద్ లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు మాట్లాడుతూ అన్ని దానాలకన్నా అంధులకు చూపు ఇచ్చే నేత్రదానం గొప్పది, వెలకట్టలేనిదన్నారు. కావున కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు ఎవరు మరణించినా, మనిషి మరణానంతరం మట్టి లో కలసి పోయే నేత్రాలు దానం చేసేందుకు నేత్రదానం పై అవగాహన కలిగి 9966609364 లేదా 7093204537 లకు సమాచారం ఇస్తే చాలు పార్థివ దేహం వద్దకే వచ్చి కార్నియాలను సేకరించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులకు మునిసిపల్ మాజీ చైర్ పర్సన్ వైఎస్ ప్రమీలమ్మ, పుర ప్రముఖులు వైఎస్ మదన్ మోహన్ రెడ్డి, వైఎస్ ప్రతాప్ రెడ్డి, బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

# వర్షపు నీటిని కాపాడుకుందాం.. భూగర్భ జలాలను సంరక్షిద్దాం

**పులివెందుల, మే 17 (జనస్వరం) :** వర్షపు నీటిని కాపాడుకుని భూగర్భ జలాలను సంరక్షించుకుందామని డాక్టర్ జయమ్మ పేర్కొన్నారు. పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాలలో భాగంగా "నీరు-మీరు" అనే అంశం మీద శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి డాక్టర్. జయమ్మ మాట్లాడుతూ ప్రతినెల మూడవ శనివారం ఈ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. వాటర్ టేబుల్స్ స్థాయి పెరిగితే బోర్ వెల్స్ తవ్వే అవసరం లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. వర్షపు నీటిని సంరక్షించుకోవడం, ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం మొదలగు పద్ధతులు ద్వారా నీటి వనరులను కాపాడుకుంటే భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గించి తద్వారా వాటర్ టేబుల్ ను మెరుగుపరుచుకోవచ్చన్నారు. ఆహార పరిశ్రమలు, ఇతర పరిశ్రమల నుంచి వచ్చే వృధా నీటిని రీసైక్లింగ్ చేయడం ద్వారా ఆ నీటిని నీటిపారుదలకు, ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ నీటి సంరక్షణ గురించి అవగాహన కల్పించే దిశగా ప్రభుత్వం నేడు "నీరు-మీరు" అనే అంశం స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రవేశపెట్టిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు కళాశాల భవనం ఎదురుగా ఉన్న చెక్ డ్యాం ప్రాంతంలో ఉన్న ముళ్ళ కంచెలను, చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ, అధ్యాపకుడు డాక్టర్ సాయి




శ్రీనివాస్, పి.డి. డాక్టర్ రాజశేఖర్, కళాశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు.

# కాలువల అత్యవసర పనులకు రూ.344 కోట్లు మంజూరు

**- చంద్రబాబు సారధ్యంలోనే రైతులకు మేలు**
**- రూ.334 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి రామానాయుడు.**

**పాలకొల్లు, మే 17 (జనస్వరం) :** రాష్ట్రంలో పంట కాలువలు, మురుగు డ్రైన్ల నిర్వహణ, మరమ్మతు పనులకు రూ.344 కోట్ల చంద్రబాబు మంజూరు చేశారని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోను, నేడు కూటమి ప్రభుత్వంలోనూ రైతులకు పక్షపాతిగా చంద్రబాబు పని చేస్తున్నారన్నారు. పాలకొల్లు మండలం రూరల్ గ్రామ పెద్దగరువు, పూలపల్లి, ఆగరు, పట్టణ పరిధిలోని 18,23 వార్డుల్లో 334 లక్షలతో జరగనున్న పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి మంత్రి రామానాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కాలువలు, మురుగు డ్రైన్ల అత్యవసర పనులను ఈ మే నెలాఖరు నాటికి పూర్తిచేసేలా ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. రూ.10 లక్షలు లోపు పనులను సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో, 10 లక్షలు దాటితే ఏడు రోజుల్లోపు షార్ట్ టెండర్లు పిలవాలని ఆదేశించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, గత జూన్ నెలలో 90 కోట్లతోనూ, సెప్టెంబర్ లో అత్యవసర పనులుగా 326 కోట్లతో పనులు జరిగాయన్నారు. రైతులకు మేలు చేసే కాలువల మట్టి త్రవ్వకం, తూడు గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టామన్నారు. కాలువల వెంబడి గ్రావెల్ రహదారులు, కాంక్రీట్ గోడ నిర్మాణాలు వంటివి పెద్ద ఎత్తున చేపట్టినట్లు చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో, అత్యవసర మెయింటినెన్స్ పనులకు అర్ధ రూపాయి ఖర్చు గాని, అరబస్త సిమెంట్ గాని, తట్ట మట్టి పని గానీ నోచుకోలేదన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు రైతులు మహిళలు మంత్రి రామానాయుడుకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులుఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మాజీ ఏఎంసీ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, కోడి విజయభాస్కర్, పాములు రజని కుమార్, దొడ్డ శ్రీనివాస్, అంబటి శేషగిరి, కానూరు జానకి రామారావు, భూపతిచిన్న పెద్ది రాజు, భూపతి సువరణ రాజు వెగేసిన శ్రీహరిరాజు, గుబ్బల హరిప్రసాద్, పాలపర్తి చాంద్ రాజు, గాది రాజు అర్జున్ రాజు, అల్లూరి సత్యనారాయణ



రాజు, సాగి మురళీకృష్ణ, పంచగళ్ల సైమన్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పిచ్చేట్టి బాబు పాలకొల్లు పట్టణ టీడీపీ అధ్యక్షులు జివి పొట్నూరు శ్రీనివాస్ ఉన్నమట్ల కపర్తి, పసుపులేటి రాజేష్ కన్నా మల్లుల వెంకట్ పసుపులేటి జేమ్స్ చీరా శివన్నారాయణ కరీంనగర్ మాతా రత్నరాజు కోడి విజయభాస్కర్ ఎర్ర బాబి ఇంటి ధర్మ ఉందుర్తి నాగచంద్ తమిరి వెంకటేశ్వరరావు, అన్న బత్తుల దుర్గారావు మహమ్మద్ రఫ్ బాలి వెంకటేశ్వరరావు దొడ్డ జనార్ధన్ మురాల విజయలక్ష్మి సాధికార మిత్ర సభ్యులు పాల్గొన్నారు

# కోవూరులో ఘనంగా తిరంగా ర్యాలీ

**కోవూరు, మే 17 (జనస్వరం) :** ఆపరేషన్ సింధూర్ విజయోత్సవాలను పురస్కరించుకుని కోవూరులో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. బజారు సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సాగిన ఈ ర్యాలీలో వంద మీటర్ల మేర మువ్వన్నెల జాతీయ పతాకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు దేశభక్తితో నిండిన నినాదాలతో పాల్గొనడం విశేషం. "వందే మాతరం", "భారత్ మాతాకీ జై" నినాదాలతో కోవూరు వీధులు మార్మోగాయి. ప్రజలు చేతబట్టి మువ్వన్నెల జెండాతో ర్యాలీలో పాల్గొని దేశ భక్తిని చాటారు. ఈ సందర్భంగా మాతృభూమి రక్షణలో ప్రాణాలర్పించిన తెలుగు వీరుడు మురళి నాయక్ కు ఘన నివాళులు అర్పించారు. గగనతల యుద్ధంలో పాకిస్తాన్ వెన్నువిరిచిన భారత సైనికుల శౌర్యాన్ని ప్రశంసిస్తూ నినాదాలు వెల్లువెత్తాయి. ర్యాలీలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి చప్పిడి శ్రీనివాసులు రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశి రెడ్డి, బుచ్చి మున్సిపల్ చైర్మన్ మోర్ల సుప్రజ, టీడీపీ సీనియర్ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, వీరేంద్ర నాయుడు, ఇంతా మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారు దేశ రక్షణలో అమరులైన సైనికుల త్యాగాలను స్మరించుకున్నారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా పాక్ ఉగ్రవాద శిబిరాలు కూల్చి, ముష్కరుల మూకలను మట్టుబెట్టిన వైనాన్ని ప్రజలకు వివరిస్తూ, మరోసారి ఆ తరహా చర్యలకు పాకిస్తాన్ ప్రయత్నించితే ప్రపంచ పటంలో దాని ఉనికి కనిపించదని హెచ్చరించారు. విజయోత్సవాలలో పాల్గొన్న ప్రజానీకానికి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. తిరంగా ర్యాలీ విజయవంతం కావడంలో సహకరించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, వేగూరు సర్పంచ్ కరేటి అమరావతి, ఇందుకూరుపేట, బుచ్చిరెడ్డిపాలెం అర్బన్, రూరల్ టీడీపీ అధ్యక్షులు నాప వెంకటేశ్వర్లు నాయుడు, బుచ్చి జనసేన మండల అధ్యక్షులు మాధవ్, కోవూరు జనసేన మండల అధ్యక్షులు అల్తాఫ్, మన్నేపల్లి వినయ్ కుమార్ తదితర టిడిపి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# దశాబ్దాల ముంపు సమస్యకు పరిష్కార బాట




**హైదరాబాద్, మే 17 (జనస్వరం) :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని శ్రీకృష్ణనగర్ వాసులను ఎన్నో సంవత్సరాలుగా వేధిస్తున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కనుంది. ఈ మేరకు శనివారం తెలంగాణ రవాణా శాఖ మంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. 450 మిల్లీమీటర్ల వ్యాసంతో సీసీ సెవరేజ్ మెయిన్ లైన్ పనులను ప్రారంభించారు. ఈ పనులకు రూ. 2.20 కోట్లు వ్యయంతో చేపట్టనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోహమ్మద్ అజారుద్దీన్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మహిళా శ్రేణులు, యూసుఫ్‌గూడా డివిజన్ కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, "శ్రీకృష్ణనగర్ ప్రాంతంలో ముంపు సమస్య దశాబ్దాలుగా ప్రజలను బాధిస్తోంది. ఇప్పుడు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఈ సెవరేజ్ ప్రాజెక్టును ప్రారంభించాం. నాణ్యతతో పనులు పూర్తి చేసి ప్రజలకు ఊరట కలిగిస్తాం" అని తెలిపారు.

జనస్వరం
www.janaswaram.com
తెలంగాణ

# 13 మంది తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు

**పులివెందుల, మే 27 (జనస్వరం) :** అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ విషయంలో నిబంధనలు అతిక్రమించారని కడప జిల్లాలోని 13 మంది తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. గతంలో 20 ఏళ్ల కాలపరిమితితో అసైన్డ్ భూములపై రైతులకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ చట్ట సవరణలు చేసిన విషయం తెలిసిందే. అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయడంలో అవకతవకలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు రావడంతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం విచారించింది. అప్పట్లో ఆయా మండలాల్లో పనిచేసిన తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అప్పట్లో తహసీల్దార్లుగా పనిచేసిన అనూరాధ (మైదుకూరు), వి.గంగయ్య (పోరుమామిళ్ల) మధుసూదన్ రెడ్డి (బద్వేల్), విజయకుమారి (వీఎన్‌పల్లె), లక్ష్మీనారాయణ (లింగాల), మహబూబ్ బాషా (సింహాద్రిపురం), గుర్రప్ప (జమ్మ లమడుగు), ఉదయభాస్కర్ రాజు (పెండ్లిమర్రి), సువర్ణ (బి.మఠం), సరస్వతి (కమలాపురం) రామచంద్రుడు (కాశినాయన), వెంకటసుబ్బయ్య (వేముల), శంకర్రావు (వల్లూరు) లు షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు. ప్రధానంగా మైదుకూరు, లింగాల, బి.మఠం, జమ్మలమడుగు మండలాల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు తెలిసింది.

# కానిస్టేబుల్ పై సస్పెన్షన్ వేటు




**పులివెందుల, మే 17 (జనస్వరం) :** కడప ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్గా పనిచేస్తున్న సిద్ధారెడ్డిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కానిస్టేబుల్ ఎంపికల్లో అవినీతికి పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. విచారణలో తప్పు తేలడంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

# ఘనంగా యడ్ల తాతాజీ జన్మదిన వేడుకలు

**పాలకొల్లు, మే 17 (జనస్వరం) :** వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ యడ్ల తాతాజీ జన్మదిన వేడుకలను శనివారం ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు, ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని తన తండ్రి యడ్ల గణే శ్వరరావు పేరున చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఇంకా అనేక సేవా కార్యక్రమాలు చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు, పెదపాటి పెద్దిరాజు, ఖండవల్లి వాసు, మాజీ కౌన్సిలర్ కొరగింజల శ్రీనివాసరావు, మాజీ పెద్ద గోపురం చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, రామానుజుల పెద మధు, విప్పర్తి నవీన్, వడ్లమూడి విశాక్ తదితరులు పాల్గొని తాతాజీ శుభాకాంక్షలు తెలిపారు.



# బొలెరో ఢీకొని ఇద్దరు మృతి



**పులివెందుల మే 17 (జనస్వరం) :** వైఎస్సార్ కడప జిల్లా కలసపాడు మండలంలోని ఐటీఐ కాలేజీ సమీపంలో బైకును బొలెరో ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. సింగరాయపల్లెకు చెందిన సౌరమ్మ(45), మనవడు జస్వంత్ (14)తో కలిసి కలసపాడు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు.

# నెల్లూరు రూరల్ కు ఎంత చేసినా తక్కువే

**- ఏ సమస్య ఉన్నా ఒక ఫోన్ కాల్ చేయండి**
**- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి**

**నెల్లూరు, మే 17 (జనస్వరం) :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్ కావేరి అవెన్యూలో 33 లక్షల రూపాయలు వ్యయంతో సిసి రోడ్డు, సిసి డ్రైన్ కు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 25 రోజుల్లో రోడ్డు డ్రైన్ వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలు లేని వేళ పార్టీ జెండాలు పక్కనపెట్టి స్థానిక ప్రజా సమస్యల పరిష్కారం కోసం, అభివృద్దే ధ్యేయంగా పని చేద్దామని పిలుపునిచ్చారు. నెల్లూరు రూరల్ కు ఎంత చేసినా తక్కువేనని నెల్లూరు రూరల్ ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రోత్సాహంతో అధికారుల సహకారంతో రూరల్ నియోజకవర్గం లో కనీస వసతుల కల్పనకు స్థానిక ఎమ్మెల్యేగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో 20 డివిజన్ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## జ్వర బాధితుడికి 4 కిలో మీటర్ల డోలీ మోత



**చింతపల్లి, మే 17 (జనస్వరం) :** అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజన ప్రాంతాల మూలభూత సదుపాయాల లేమి మరోసారి వెలుగులోకి వచ్చింది. చింతపల్లి మండలంలోని కీటుముల పంచాయతీ పరిధిలోని నిమ్మలపాలెం గ్రామానికి చెందిన తాంబేలి జంబో (58) గత రెండు వారాలుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నాడు. గ్రామానికి రహదారి, వాహన సదుపాయాలు లేకపోవడంతో, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలిసి జంబోను డోలిలో చేర్చి, నిమ్మలపాలెం నుంచి పులిగొంది వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర అడవిలో మోసుకెళ్లారు. అక్కడి నుంచి ప్రైవేటు వాహనంలో తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అనంతరం అంబులెన్స్ సాయంతో చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం జంబో ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యాధికారులు తెలిపారు. ఈ సంఘటన గిరిజన ప్రాంతాల్లో రహదారి వంటి ప్రాథమిక సదుపాయాల అవసరాన్ని మళ్లీ గుర్తు చేసింది. ప్రతిసారీ ఇదే పరిస్థితి గర్భిణీలు, వృద్ధులు, రోగులందరూ ఇదే బాటలో కష్టపడుతున్నారు. రహదారి లేక బతకడం మరింత కష్టంగా మారుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. నిమ్మలపాలెం నుంచి పులిగొంది వరకు తక్షణ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

## చింతపల్లి–లంబసింగి దంచికొట్టిన భారీ వర్షం

**- వాహనాలకు తీవ్ర అంతరాయం**
**- విద్యుత్ సరఫరా నిలిపివేత**



**చింతపల్లి, మే 17 (జనస్వరం) :** శుక్రవారం మధ్యాహ్నం నుంచి మండలంలోని చింతపల్లి, లంబసింగి ప్రాంతాల్లో కురిసిన కుండపోత వర్షానికి జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. ఉరుములు, మెరుపులతో కూడిన ఈ మేఘగర్జన వర్షం విరుచుకుపడుతూ ఈ ప్రాంతాన్ని జలదిగ్బంధం చేసింది. వర్ష తీవ్రతకు రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఇక విద్యుత్ వ్యవస్థపైనా వర్ష ప్రభావం తీవ్రంగా పడింది. ఉదయం నుంచి విద్యుత్ లేక ప్రజలు తీవ్ర అసౌకర్యం ఎదుర్కొంటున్నారు. వర్ష ప్రభావంతో చలి వాతావరణం నెలకొని, స్థానికులు అత్యవసర అవసరాలకే బయటకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు వర్షం తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అత్యవసర సహాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


## ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. కేసు నమోదు



**బొంరాస్ పేట, మే 17 (జనస్వరం) :** దుప్చర్ల గ్రామ శివారు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టీఎస్34ఏ1922 ట్రాక్టర్ ను శనివారం పట్టుకున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రావుఫ్ తెలిపారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్ కం ఓనర్ అంజిలయ్యపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

## ఆర్థిక సహాయం అందజేసిన ఒగ్గు కళాకారులు

**బొంరాస్ పేట, మే 17 (జనస్వరం) :** మండల పరిధిలోని తుంకిమెట్ల గ్రామానికి సీనియర్ ఒగ్గు కళాకారుడు మ్యాకాల అంజిలప్ప ఇటీవల మరణించాడు. విషయం తెలుసుకున్న వికారాబాద్ జిల్లా ఒగ్గుబీర్ల కళాకారుల సంక్షేమ సంఘం తరపున శనివారం రూ.5,500 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూజారి మల్లప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి ఒగ్గు బీరప్ప, సీనియర్ ఒగ్గు కళాకారులు పూజారి నర్సప్ప, పూజారి శ్రీశైలం, స్వామి మల్లేష్, శేఖర్, గోపాల్, మల్లప్ప, లక్ష్మణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## గుణ్ణంపల్లి లో అంగన్వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

**ద్వారకాతిరుమల, మే, 17 (జనస్వరం) :** వేసవి దృష్ట్యా గర్భిణీలు, పిల్లలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అంగన్వాడీ సిబ్బందిని ఆదేశించారు. ద్వారకా తిరుమల మండలం గుణ్ణంపల్లిలో శనివారం పలు కార్యక్రమాలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడ మహిళలు, పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై అంగన్వాడీ సిబ్బంది ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంతో పాటు వేసవిలో తీసుకోవాలని చర్యలపై వారికి అవగాహన కలిగించాలన్నారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని, వారికి అందరికీ పోష్టికాహార కిట్లను పంపిణీ చేసి, వాటిని వారు వినియోగించుకునేలా చూడాలన్నారు. గర్భిణీలలో రక్తహీనత లేకుండా చూడాలని, వైద్య సిబ్బంది ద్వారా గర్భిణీలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, గర్భిణీలు, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు ఇప్పించాలన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రం ఆవరణలో నిర్మిస్తున్న వాననీటి సంరక్షణ పనులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎం. వి. రమణ, జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, ఎంపిడిఓ పి .వి.వి., ప్రకాష్, తహసీల్దార్ సుబ్బారావు, అంగన్వాడీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## రెనోవా హాస్పిటల్స్‌లో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

**హైదరాబాద్, మే 18 (జనస్వరం) :** ప్రపంచవ్యాప్తంగా మే 12న నిర్వహించే అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా, మే 17న కొంపల్లి రెనోవా హాస్పిటల్స్‌లో నర్సులకు ఘనంగా సన్మానం జరిగింది. వైద్య సేవలలో నర్సుల పాత్రకు గౌరవం తెలుపుతూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో నర్సులు తమ ప్రతిభను వినూత్న ప్రదర్శనలతో పరిచయం చేశారు. ఈ కార్యక్రమానికి రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ డా. శ్రీధర్ పెద్దిరెడ్డి అధ్యక్షత వహించారు. నర్సుల సేవలపై ప్రశంసలు కురిపించిన ఆయన, "రోగుల పట్ల అంకితభావంతో పని చేసే నర్సులు ప్రతి ఆసుపత్రి విజయానికి ప్రధాన శక్తి" అని పేర్కొన్నారు. ప్రముఖ నర్సింగ్ చిహ్నమైన ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించి, కేక్ కట్ చేసి నర్సులకు శుభాకాంక్షలు తెలిపారు. నర్సులు సంప్రదాయ నృత్యాలు, సంగీత ప్రదర్శనలతో ఆసక్తికరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెనోవా మిడ్ లెవల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ సీఈఓ డా. రాధాకృష్ణ రావు సాగి మాట్లాడుతూ, "నర్సులు ఆరోగ్య వ్యవస్థకు వెన్నెముక. వారికి భద్రమైన వాతావరణం కల్పించడమే మా లక్ష్యం" అని చెప్పారు. రెనోవా గ్రూప్ సీఓఓ రవీంద్రనాథ్ గరగ మాట్లాడుతూ, "ఈ ఏడాది నినాదం 'మన నర్సులు, మన భవిష్యత్తు'. నర్సులు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు గుండె వంటివారు" అని వివరించారు. ఈ కార్యక్రమంలో డా. కె. కృష్ణ మోహన్ (డైరెక్టర్, జనరల్ & లాపరోస్కోపిక్ సర్జన్), డా. ఎస్. శ్రీనాథ్ (కన్సల్టెంట్ న్యూరో సర్జన్), డా. అరుణ్ దేవ్ (ఆర్థోపెడిక్ సర్జన్), డా. నితిన్ రెడ్డి (జనరల్ ఫిజిషియన్), డా. మహాదేవ్ (సీనియర్ మేనేజర్) తదితరులు,



నర్సింగ్, పారామెడికల్, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మార్కెట్ ధర కోసం కోకో రైతుల దీక్ష

**- ఎండను లెక్కచేయకుండా మోండలీజ్ కంపెనీ ఎదుట కోకో రైతుల పోరాటం**
**- కంపెనీల కార్యకలాపాల నిలుపుదలపై డిమాండ్, రిటైర్డ్ డీజీపి ఏబీ వెంకటేశ్వరరావు సంఘీభావం**

**దెందులూరు (సోమవరప్పాడు), మే 17 (జనస్వరం) :** కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ కోకో రైతులు సోమవరప్పాడు జాతీయ రహదారిపై ఉన్న మోండలీజ్ కంపెనీ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి కోకో రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ డీజీపి ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, "చాక్లెట్ కంపెనీలు వేల కోట్ల లాభాలు గడిస్తూ కోకో రైతులను దారుణంగా మోసం చేస్తున్నాయి. గింజలకు అంతర్జాతీయ ధర ఇచ్చేందుకు నిరాకరించడం అన్యాయం," అని అన్నారు. రైతుల సమక్షంలో చర్చలు జరిపి న్యాయమైన ధరను నిర్దేశించాలని, అప్పటివరకు కంపెనీ కార్యకలాపాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కంపెనీల మోసాలపై ఆగ్రహం : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై. కేశవరావు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడుతూ, "రెండున్నర నెలలుగా రైతులు పోరాటం చేస్తున్నా కంపెనీలు స్పందించకపోవడం దారుణం. విదేశీ దిగుమతులు నిలిపివేసి దేశీయ రైతును ఆదుకోవాలి," అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. భవిష్యత్ కార్యాచరణపై హెచ్చరిక : కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, "ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో ధర రూ.935. అదే ధర రైతులకు చెల్లించాలి. ఇప్పటివరకు కొనుగోలు చేసిన గింజలకు కూడా తేడా ధర చెల్లించాలి. 19 లేదా 20న జరిగే చర్చల ప్రకారమే భవిష్యత్ ఉద్యమ తీవ్రత ఉంటుందని" హెచ్చరించారు. సంఘీభావంతో బలమైన పోరాటం : రైతు నేతలు ఎస్. గోపాలకృష్ణ, బొల్లు రామకృష్ణ, పానుగంటి అచ్యుతరామయ్య, గుదిబండి వీరారెడ్డి, కాసరనేని విద్యాసాగర్ మాట్లాడుతూ, కోకో రైతులు సంఘటితంగా పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఒక్కో కంపెనీ ఒక్కో ధర విధించడం వెనక కుట్ర ఉందన్నారు.పోలీసు మోహరింపు, చర్చలు : దీక్ష సందర్భంగా మోండలీజ్ కార్యాలయం వద్ద పోలీసులు మోహరించారు. తహసీల్దార్ సుమతి సమక్షంలో కంపెనీ మేనేజర్ రాజేష్ రామచంద్రన్తో రైతు సంఘ నాయకులు,




ఏబీ వెంకటేశ్వరరావు చర్చలు జరిపారు. ధరపై చర్చలు జరిపే వరకు కంపెనీ కార్యకలాపాలు నిలిపివేయాలని కోరగా, యాజమాన్యం అంగీకరించింది. అన్ని కంపెనీలకు కూడా ఇదే సూచన పంపినట్టు సమాచారం. ఈ కార్యక్రమంలో కోనేరు సతీష్ బాబు, పాలడుగు నరసింహారావు, పానుగంటి నరేష్, వంకినేని లక్ష్మీనారాయణ, డి. నరేష్, నాగరాజు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు. జిల్లా రైతు సంఘాల నేతలు కట్టా భాస్కరరావు, డి.ఎన్.వి.డి. ప్రసాద్ ఈ పోరాటానికి సంఘీభావం ప్రకటించారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పూర్తిస్థాయిలో చర్యలు

**- విభజన ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇచ్చేది అన్ని పథకాలు అమలు చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే**
**- నాలుగు మండలాల కమిటీలను ప్రకటించిన జిల్లా అధ్యక్షులు, నియోజవర్గ ఇంచార్జ్**
**- ఏలూరు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్రావు, దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ కన్వీనర్ ఆలపాటి నరసింహమూర్తి**

**దెందులూరు, మే 17 (జనస్వరం) :** దేశంలో మంచి సుపరి పరిపాలన అందించాలంటే మన దేశానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ యువనేత రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇంన్చార్జ్ కన్వీనర్ ఆలపాటి నరసింహమూర్తి అన్నారు. శనివారం దెందులూరు నియోజకవర్గం లోని పెదవేగి మండలం మందూరు గ్రామంలోని దెందులూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి కన్వీనర్ ఆలపాటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో దెందులూరు నియోజకవర్గం స్థాయి కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, ఆలపాటి నరసింహమూర్తి మాట్లాడుతూ ఆటు కేంద్రంలో భాజపా ఎక్కడ ఆంధ్రప్రదేశ్లో టిడిపి కూటమీ ప్రభుత్వ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలం వెళ్లబుచ్చుతుందన్నారు. అధికారంలోకి వచ్చి



సంవత్సరం అయినా ఇప్పటికి కూడా మహిళలకు కల్పిస్తానన్నా ఉచిత బస్సు ఎప్పుడు కల్పిస్తారో అని దుయ్యబట్టారు. రైతులకు ఇప్పటివరకు వ్యవసాయ పెట్టుబడి సాయం ఎప్పుడు అందిస్తారో, తల్లికి వందనం ఎప్పుడు అందిస్తారో ఎప్పటికి తెలియని పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఉందని విమర్శించారు. రైతు వరి దాన్యం పండిస్తే టార్గెట్ అంటూ ధాన్యం కొనుగోలు చేయకుండా కాలయాపన చేశారని విమర్శించారు .ఎప్పటికైనా ప్రజలకు మీరు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజా వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిలారెడ్డి ఆదేశాలతోనూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళిక బద్ధంగా కమిటీలు వేయడం జరుగుతుందన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరే : దెందులూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మేదిన పాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నేతల సుబ్బారావు, పెదవేగి మండలం అధ్యక్షులుగా మందూరు గ్రామానికి చెందిన



చిలకలపూడి తాతకృష్ణ, పెదపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గ్రామానికి చెందిన రంభ కిషోర్, ఏలూరు రూరల్ మండల అధ్యక్షులుగా చాటపర్రు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అరిగిల యోహాను లను మండల పార్టీ అధ్యక్షులుగా దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ ఆలపాటి నరసింహమూర్తి, జిల్లా పార్టీ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్రావు ఆధ్వర్యంలో మండల కమిటీలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దెందులూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం యువత అధ్యక్షులు ఆలపాటి చౌదరి, ఏలూరు సిటీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తాళ్లూరి చక్రవర్తి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కె ఎస్ ఎన్ మూర్తి, సేవాదళ్ నాయకులు ఎస్వి సుబ్బారావు, కిసాన్ సెల్ నాయకులు కొమ్మన సాంబశివరావు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. పాకిస్తాన్ తో మన భారతదేశ ఆర్మీ జవాన్లు మంచి పోరాట పటిమ కనపరిచి పోరాటం చేసి వీరా మరణం పొందిన జవాన్లకు వారి ఆత్మకు శాంతి చేకూరాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

## పెదవేగి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఈడుపుగంటి అనిల్ ఏకగ్రీవ ఎన్నిక

**దెందులూరు, మే 17 (జనస్వరం) :** నియోజకవర్గంలోని పెదవేగి మండలం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులుగా తెలుగుదేశం పార్టీ యువ నేత కే కన్నాపురం గ్రామానికి చెందిన ఈడుపుగంటి అనిల్ ను ఏకగ్రీవంగా ఈ సందర్భంగా అనిల్ కు దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ అభినందనలు తెలిపారు. నూతన మండల అధ్యక్షులుగా ఎంపికైన ఈడుపుగంటి అనీల్ ను మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తాళ్ల గోకవరం గ్రామ సర్పంచ్ నెక్కలపూడి సురేష్, టీడీపీ సీనియర్ నేత తాత సత్యనారాయణ, వేగివాడ తెలుగుదేశం పార్టీ యువనేత కొనకళ్ల శివమణి గౌడ్ తో పాటు పలువురు నూతన మండల అధ్యక్షుడిగా ఎంపికైన ఈడుపుగంటి అనిల్ కు శుభాకాంక్షలు తెలిపారు. వీరితోపాటు పెదవేగి మండలం తెలుగుదేశం పార్టీ కార్యదర్శిగా రాయన్నపాలెం గ్రామానికి చెందిన పామర్తి నాగభూషణం మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వీరిద్దరికీ శుభాకాంక్షలు తెలిపారు.



## ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర

**- ఉష్ణతాపం నుంచి ఉపశమనం అంశంతో కార్యక్రమం నిర్వహణ**
**- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు తాగునీటి సరఫరా వసతులు ఏర్పాటు**
**- కార్యాలయాల్లో శుభ్రత కార్యక్రమాల్లో ప్రభుత్వ సిబ్బంది**

**ఏలూరు, మే 17 (జనస్వరం) :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలు,సంస్థల ఆధ్వర్యంలో మూడవ శనివారం సందర్భంగా స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో చేపట్టారు. ఈ నెలలో అంశంగా ఉష్ణతాపం నుంచి ఉపశమనం(బీట్ ద హీట్) రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆధ్వర్యంలో ఉష్ణతాపం నుంచి వడగాల్పుల నుంచి ఉపశమనం కల్పించే చర్యలు చేపట్టారు.జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నెలరోజుల పాటు చేపట్టేందుకు వీలుగా శనివారం నుంచి కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సందర్శకుల కోసం తాగునీటి వసతిని ఏర్పాటు చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది శ్రమదానం చేసి కార్యాలయాలను, ఆవరణలను శుభ్రపరిచే కార్యక్రమంలో పాల్గొన్నారు. పలుచోట్ల ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయంను,పరిసరాలను సిబ్బంది శుభ్రంచేసి, పక్షులకు, పశువులకు మంచినీటి సౌకర్యాన్ని కల్పించారు.జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో పవర్ పేటలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. కైకలూరు సిహెచ్ సిలో డిసిహెచ్ ఎస్ డాక్టరు పాల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు, పత్తేబాధ రైతు బజారు వద్ద ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, ఎస్సీ కార్పొరేషన్ యం.ముక్కంటి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు,ఆర్డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాలు, డిఆర్డిఏ పిడి ఆర్.విజయ రాజు ఆధ్వర్యంలో పక్షులకు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు.




Owned by : Sake Naresh (Chairman) - 9642067900, Managed by : Jammu Sai Kalyan (Managing Director) - 7013030690,
REGD NO :APTEL 16144, Mail Id : janaswaramnews@gmail.com Dr.no : 9-35-4A, Illipilli Narasimha Rao Street, Opp KBN College, Kothapeta, Vijayawada - 520001.

# గుణ్ణంపల్లి లో అంగన్వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ



**ద్వారకాతిరుమల, మే, 17 (జనస్వరం) :** వేసవి దృష్ట్యా గర్భిణీలు, పిల్లలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అంగన్వాడీ సిబ్బందిని ఆదేశించారు. ద్వారకా తిరుమల మండలం గుణ్ణంపల్లిలో శనివారం పలు కార్యక్రమాలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడ మహిళలు, పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై అంగన్వాడీ సిబ్బంది ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంతో పాటు వేసవిలో తీసుకోవాలని చర్యలపై వారికి అవగాహన కలిగించాలన్నారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని, వారికి అందరికీ పౌష్టికాహార కిట్లను పంపిణీ చేసి, వాటిని వారు వినియోగించుకునేలా చూడాలన్నారు. గర్భిణీలలో రక్తహీనత లేకుండా చూడాలని, వైద్య సిబ్బంది ద్వారా గర్భిణీలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, గర్భిణీలు, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు ఇప్పించాలన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రం ఆవరణలో నిర్మిస్తున్న వాననీటి సంరక్షణ పనులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎం. వి. రమణ, జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, ఎంపిడిఓ పి .వి.వి., ప్రకాష్, తహసీల్దార్ సుబ్బారావు, అంగన్వాడీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దెందులూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నేతల సుబ్బారావు



**దెందులూరు, మే 17 (జనస్వరం) :** కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతానికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తుంది. దీనిలో భాగంగా ఏలూరు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి కన్వీనర్ ఆలపాటి నరసింహమూర్తి పార్టీ బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం దెందులూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మేదిన రావు పాలెం గ్రామ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, నేతల సుబ్బారావును కాంగ్రెస్ పార్టీ దెందులూరు మండల అధ్యక్షులుగా నియమిస్తూ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్రావు, దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి కన్వీనర్ ఆలపాటి నరసింహమూర్తి ఎంపిక పత్రాన్ని నేతల సుబ్బారావుకు అందజేశారు. ఈ సందర్భంగా నేతల సుబ్బారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతానికి అందర్నీ కలుపుకుని ముందుకు వెళ్తానని ప్రజా వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పార్టీ తరపున రాజీలేని పోరాటం చేస్తానని సుబ్బారావు తెలిపారు. తనపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా తనను నియమించినందుకు బాధ్యతగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా పనిచేస్తానని నేతల సుబ్బారావు అన్నారు.

# యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ తనిఖీ

**- కేసుల పరిష్కార వేగం పెంచాలని అధికారులకు సూచన**
**- సీసీటీవీలు, అవగాహన కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి**



**యలమంచిలి, మే 17 (జనస్వరం) :** అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ శనివారం ఎలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ వి. విష్ణు స్వరూప్, యలమంచిలి సీఐ ధనుంజయ రావు, రూరల్ ఎస్సై ఉపేంద్ర తదితరులు ఆయనకు ఆత్మీయంగా స్వాగతం పలికారు. తదుపరి సమీక్షలో ఎస్పీ పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని పరిశీలించారు. దర్యాప్తు తక్షణమే పూర్తిచేసి చార్జ్‌షీట్లు వేయాలని, తప్పించుకుంటున్న నిందితులను త్వరగా అరెస్టు చేయాలని ఆదేశించారు. ఎన్‌బిడబ్ల్యూలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. చెడు నడత కలిగిన వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, రోడ్డుప్రమాదాలు మరియు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణ కోసం సీసీటీవీలు పెంచాల్సిన అవసరం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. నేషనల్ హైవేలపై వాహనాలు నిలిపే విధానాన్ని పూర్తిగా అరికట్టాలని అధికారులను ఆదేశించారు. మహిళల భద్రత కోసం శక్తి యాప్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పాఠశాలలు, కాలేజీల్లో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ నివారణ, పాథకులలో గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, పోక్సో యాక్ట్, సైబర్ నేరాలపై చైతన్యం పెంచేందుకు ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రికార్డుల తనిఖీ, అధికారుల పనితీరుపై సంతృప్తి : తదుపరి దశలో సర్కిల్ కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేసి తుహిన్ సిన్హా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో ట్రైనీ డీఎస్పీ కృష్ణ చైతన్య, ఎలమంచిలి టౌన్ ఎస్సై సావిత్రి, ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ, మునగపాక ఎస్సై ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీపై దుష్ప్రచారం మానుకొని మన్యప్రాంత అభివృద్ధికి తోడ్పడండి



**చింతపల్లి, మే 17 (జనస్వరం) :** తప్పుడు ప్రచారాలతో వైసీపీని దూషించేందుకు ప్రయత్నాలు చేస్తున్న జనసేన నాయకులు వెంటనే ఆ ప్రయత్నాలను విరమించుకొని మన్య ప్రాంతా అభివృద్ధికి తోడ్పడాలని పెదబరడ పంచాయతీ ఉపసర్పంచ్ ఎం. లోవరాజు. శనివారం ఆయన వార్డు సభ్యుడు పొట్టిక లక్ష్మణ్, పార్టీ కార్యకర్తలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జనసేన నాయకులు ఉల్లి సీతారాం, కిముడు కృష్ణమూర్తి చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యమని ఖండించిన లోవరాజు, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో వైకాపా ప్రభుత్వానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చట్టపరంగా కట్టుబడి ఉందా అని చురుకలు అంటించారు. తప్పుదారిలో నడిచిన వారిని జనసేన కండువా కప్పి వైకాపా నేతలుగా చిత్రీకరించడం బాధ్యతారాహిత్యంగా ఉందని ఆయన విమర్శించారు. రామకృష్ణ అనే వ్యక్తికి వైకాపాతో ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతంలో ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీని గెలిపించే సామర్థ్యం వైసీపీకి ఉందని గుర్తుచేశారు. వార్డు సభ్యులుగా కూడా గెలవలేని నేతలు వైకాపాను విమర్శించేందుకు అర్హతలేంటీ...? అని ప్రశ్నించిన లోవరాజు, జనసేన నేతలు విమర్శలు మానుకొని మన్య ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైకాపా కార్యకర్తలు పిండి రమణ, బోండా బుజ్జిబాబు పాల్గొన్నారు.

# పిడుగుపాటుతో విరిగిపడిన చెట్టు

**- తప్పిన పెను ప్రమాదం**




**చింతపల్లి, మే 17 (జనస్వరం) :** శనివారం మధ్యాహ్నం మండలంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షం సమయంలో లబ్బంగి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఉన్న సిల్వర్ చెట్టుపై పిడుగు పడింది. ఈ ఘటనలో చెట్టు పూర్తిగా విరిగి నేలకూలింది. అదృష్టవశాత్తు ఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. పాఠశాల భవనానికి ఎలాంటి నష్టం జరగలేదని లబ్బంగి గ్రామస్తులు వెల్లడించారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినట్టు గ్రామస్థులు తెలిపారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ హైదరాబాదు జిల్లా శాఖ మీడియా కన్వీనర్‌గా నీలం రమేష్

**- ఏజీఎం ఇన్చార్జ్ బాధ్యతలు కూడ తనకు అప్పగింపు**
**- చైర్మన్ మామిడి భీమ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన నీలం రమేష్**




**హైదరాబాద్, మే 17 (జనస్వరం) :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ మీడియా కన్వీనర్, ఏజీఎం ఇన్చార్జిగా నీలం రమేష్‌ను నియమించినట్లు జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి ప్రకటించారు. సామాజిక రంగంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన అనుభవాన్ని పరిగణలోకి తీసుకొని ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ప్రారంభమయ్యే రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్, జనఔషధీ మెడికల్ షాపు నిర్మాణ కార్యక్రమాల్లో నీలం రమేష్ భాగస్వామ్యం వహించనున్నారని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో జరుగనున్న అభివృద్ధి కార్యక్రమాలను మీడియా ద్వారా సమర్థంగా ప్రచారం చేయడం కోసం ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నీలం రమేష్ మాట్లాడుతూ, "ఈ నూతన బాధ్యతలను నాకు అప్పగించిన చైర్మన్ మామిడి భీమ్ రెడ్డికి నా ప్రత్యేక ధన్యవాదాలు. రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాల విస్తరణలో నా వంతు పాత్రను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తాను," అని పేర్కొన్నారు. అలాగే, హైదరాబాదు జిల్లా శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

# అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



**శేరిలింగంపల్లి, మే 17 (జనస్వరం) :** మాదాపూర్ లోని శిల్పారామం వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం నాద ముద్ర స్కూల్ అఫ్ మ్యూజిక్ అండ్ డాన్స్ గురువు చైతన్య కుసుమ ప్రియా వారి శిష్య బృందంచే భారతనాట్యాన్ ప్రదర్శనలో గణేశా పంచరత్న, కౌతం, శృంగారలహరి, సప్త తాండవం, సూర్యాష్టకం, అర్ధనారీశ్వరాష్టకం, తిల్లాన, మంగళం అంశాలను రీతూపర్ణ, లాశ్రీత సాయి, హరిణి, అనన్య, తరిని, నిహారిక, మానస, శ్రీలత, డాక్టర్ ఆనంద్ మీనన్, రమ్య ప్రదీప్ లు ప్రదర్శించి మెప్పించారు. డాక్టర్ శ్రిష్టి బుధోరి భరతనాట్య ప్రదర్శనలో దశావతరం, తిల్లాన, విషమ కారణాన, జగదోదరణ అంశాలను ప్రదర్శించి మెప్పించారు. గత పదిహేను రోజుల నుండి శిల్పారామం మాదాపూర్ లో నిర్వహిస్తున్న సమ్మర్ ఆర్ట్ క్యాంపు శనివారం తో ముగిసింది. పిల్లలు పెద్దవాళ్లు అందరు ఇప్పటివరకు నేర్చుకున్నవి అన్ని ప్రదర్శించారు. స్పెషల్ ఆఫీసర్ శిల్పారామం జి. కిషన్ రావు విచ్చేసి పాల్గొన్నవారినందరిని అభినందించి ప్రశంస పాత్రలను ఇచ్చి సత్కరించారు.



# యలమంచిలిలో ఘనంగా "తిరంగా ర్యాలీ"

**- సైనికుల సేవలకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్**
**- జాతీయ ఐక్యతకు హర్షధ్వానాలు**



**యలమంచిలి, మే 17 (జనస్వరం) :** అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గంలో జాతీయ ఐక్యతను ప్రతిబింబించేలా "తిరంగా ర్యాలీ"ని ఘనంగా నిర్వహించారు. ఎలమంచిలి నుంచి తెరవుపల్లి వరకు కొనసాగిన ఈ ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, చైర్పర్సన్ పిల్లా రమాకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే "భారతమాతకీ జై", "వందే మాతరం" నినాదాలు గర్జించి జాతిపట్ల తన గౌరవాన్ని వ్యక్తపరిచారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్లకు నివాళులర్పించారు. ఇటీవల భారత సైన్యం విజయవంతంగా నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయాన్ని గుర్తు చేస్తూ, భారత సైనికుల ధైర్యాన్ని అభినందించారు. "సైనికులు దేశ రక్షణ కోసం వీరోచితంగా పోరాడుతున్నారు. వారి త్యాగాలను మనం స్మరించుకోవాలి. ఆపరేషన్ సింధూర్‌కు ఇద్దరు మహిళలు నాయకత్వం వహించడమూ, తెలుగు ప్రజల సేవా నిబద్ధత కూడా గర్వకారణం," అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో తెలుగువారు ఇద్దరు సహా పర్యాటకులు మరణించిన సంఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదులు దేశ ఐక్యతను దెబ్బతీయాలనే కుట్రలు పన్నుతున్నారని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా సైనికుల కుటుంబ సభ్యులను సన్మానించి, వారి త్యాగాలను స్మరించుకున్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వాళ్లను పట్టించుకోకూడదని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ర్యాలీకి దేశభక్తి భావనతో నిండి, జాతీయ ఐక్యతకు పెద్ద పీట వేసేలా ప్రాముఖ్యత లభించింది.

# లోతుగెడ్డ జంక్షన్‌లో ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీటి సరఫరా

**చింతపల్లి, మే 17 (జనస్వరం) :** లోతుగెడ్డ జంక్షన్ ప్రాంతాన్ని అనేకకాలంగా వేధిస్తున్న త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కన్పించనుంది. గ్రామ ప్రజల ఇబ్బందులను సమీక్షించిన ఎంపీడీవో శ్రీనివాసరావు తక్షణ చర్యలకు పాల్పడ్డారు. ప్రస్తుతం పాడైపోయిన నీటి పైపులు, మోటర్లను మరమ్మత్తు చేయించి, ఇంటింటికీ కుళాయి ద్వారా శుద్ధి చేసిన తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. గ్రామస్థులతో సమావేశమై సమస్యలపై అవగాహన కలిగి, స్వయంగా పరిశీలన జరిపిన ఎంపీడీవో, నీటి పంపిణీ వ్యవస్థను పునరుద్ధరించేందుకు చర్యలు ప్రారంభించారు. ఈ నిర్ణయం గ్రామస్తుల్లో ఆనందాన్ని నింపింది. ఎన్నో రోజులుగా తాగునీటి కొరతతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఇప్పుడు ఉపశమనం పొందారు. ఎంపీడీవో శ్రీనివాస్ చొరవకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో తమ ఇళ్లకు స్వచ్ఛమైన నీరు అందుతుందన్న ఆశతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్యతో తాగునీటి సమస్యకు తెరపడనుందని, ఇకపై నీటి కొరత అనేది చరిత్రలోకే పరిమితమవుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఘనంగా రవి కుమార్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు

**శేరిలింగంపల్లి, మే 17 (జనస్వరం) :** బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే రవి కుమార్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా శనివారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్ లోని కార్పొరేటర్ కార్యాలయం వద్ద బీజేపీ పార్టీ ప్రజా ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకుల, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి రవి కుమార్ యాదవ్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ గచ్చిబౌలి డివిజన్ బీజేపీ పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు.అనంతరం కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ రవి కుమార్ యాదవ్ రాష్ట్ర రాజకీయాల్లో ఒక స్పష్టమైన దిశా నిర్దేశకులుగా ఎదుగుతున్నారు. ప్రజల సమస్యల పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధి, పార్టీ అభివృద్ధిపట్ల ఆయన చూపించే నిబద్ధత ఈ తరం నాయకులకు ఆదర్శంగా నిలుస్తుంది. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అని పేర్కొన్నారు. అలాగే పలువురు నేతలు కూడా రవి కుమార్ యాదవ్ నాయకత్వ లక్షణాలను కొనియాడుతూ, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. రవి కుమార్ యాదవ్ ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరేన్నో జరుపుకోవాలని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, యువకులు, అభిమానులు పాల్గొన్నారు.






# అచ్చుతాపురం - అనకాపల్లి రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

**- బ్రిడ్జి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**



**యలమంచిలి, మే 17 (జనస్వరం) :** యలమంచిలి నియోజకవర్గంలోని అచ్చుతాపురం నుంచి అనకాపల్లి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో హరిపాలెం, కొండకర్ల, మునగపాక గ్రామాల సమీపంలో నిర్మాణంలో ఉన్న ఆవ కాలవ బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జికి సంబంధించి జరుగుతున్న కాంక్రీట్ వాల్ నిర్మాణాన్ని స్థానిక అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి తాను ప్రత్యక్షంగా పరిశీలించినట్లు తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని బ్రిడ్జి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. "నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదు. ప్రజల ప్రాణాలు, భద్రతతో ఎక్కడా ఆటలాడొద్దు," అని ఎమ్మెల్యే అధికారులకు గట్టిగా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో సంభాషిస్తూ, అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# రిపోర్టర్ మురళి కుటుంబ సభ్యులను పరామర్శించిన మురళి రాజు




**ప్రత్తిపాడు, మీ 17 (జనస్వరం) :** ప్రత్తిపాడు మండలం ప్రింట్ మీడియా సీనియర్ రిపోర్టర్ రెడ్నం మురళి తండ్రి చిన్న గోవిందు ఇటీవల అకాలముగా మృతి చెందారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజవర్గ వైసిపి నేత మరియు నరసాపురం పార్లమెంటు పరిశీలికులు, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళి రాజు శనివారం మురళి కుటుంబ సభ్యులును పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే శరభవరం గ్రామానికి చెందిన వైసిపి సోషల్ మీడియా అధ్యక్షులు ఉలుసు శివ తండ్రి కృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు ఈ సందర్భంగా ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణను పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని మెరుగని అందించాలని డాక్టర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి అమరాధి కాశీ, రంగనాథం అబ్బాయి, కోలా తాతబాబు,జువ్వల దొరబాబు, దొడ్డిపట్ల కృష్ణ పోకనాటి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా సాగిన తిరంగా యాత్ర

**- సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరులో దేశభక్తి సందేశం**



**సర్వేపల్లి, మే 17 (జనస్వరం) :** దేశం మొత్తం ఒకే నినాదంతో – "భారత్ మాతాకీ జై" అంటూ భారత సైన్యం విజయవంతంగా చేపట్టిన ఆపరేషన్ సింధూకు సంఘీభావంగా, పాకిస్తాన్ మద్దతుతో మూర్ఖంగా ఎదురు దూస్తున్న ఉగ్రవాదంపై గట్టి సందేశం ఇవ్వడంలో భాగంగా, సర్వేపల్లి నియోజకవర్గంలోని ముత్తుకూరు మండలంలో తిరంగా యాత్ర విజయవంతంగా నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఇందులో తెలుగుదేశం, జనసేన, బీజేపీల నాయకులు, కార్యకర్తలు, అలాగే వేలాదిగా ప్రజలు పాల్గొని జాతీయ ఐక్యతకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రతి ఒక్కరూ "ఒకటే మాట - ఒకటే బాణం - ఒకటే పోరాటం" అనే భావోద్వేగ నినాదాలతో దేశభక్తిని చాటిచెప్పారు ఈ సందర్భంగా జనసేన పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు మాట్లాడుతూ "భారత దేశ ఖ్యాతిని ప్రపంచంలో నిలబెట్టిన ఆపరేషన్ సింధూ పట్ల మనం గర్వపడాలి. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేసే భారత సైన్యానికి సంఘీభావంగా, మనం ఒక్కటిగా నిలబడాలి. యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు ఇదే సరైన సమయం" అన్నారు. ఈ కార్యక్రమం యువతలో దేశభక్తి స్ఫూర్తిని నూరి పోసిందని, భవిష్యత్ భారతానికి దీక్షాబంధంగా నిలుస్తుందన్నారు.

# అంగనవాడి కార్యకర్త అక్రమ తొలగింపుపై అంగన్వాడీల నిరసన



**శంఖవరం, మే 17 (జనస్వరం) :** శంఖవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల రౌతులపూడి మండలంలోని రామకృష్ణాపురం అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తున్న అంగనవాడి కార్యకర్త ఎం పద్మను అక్రమంగా తొలగించడం పై శనివారం అంగన్వాడి కార్యకర్తలు నిరసన తెలిపారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ శంఖవరం ప్రాజెక్టు అధ్యక్షురాలు బి రత్నకుమారి, ప్రధాన కార్యదర్శి గెడ్డం బుల్లమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీలు అంగన్వాడీ కార్యకర్త పద్మను ఎందుకు అక్రమంగా తొలగించారని, నియామకంలో నాలుగు దఫాలు బిసి బి కోసంనోటిఫికేషన్ విడుదల అయినప్పటికీ ఎవ్వరూ లేని సమయంలో 2013లో దళితురాలైన పద్మను నియమించారన్నారు. ఇప్పటివరకు లేని అడ్డంకి ఇప్పుడు ఏమిటని, ఇప్పుడు ఎందుకు తొలగిస్తున్నారంటూ అధికారులను నిలదీశారు. అంగన్వాడీ కార్యకర్త పద్మ అక్రమ తొలగింపుకు నిరసిస్తూ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట బైఠాయించి అంగన్వాడీలు తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ నేతలు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్త తొలగింపు ఆర్డర్ అంగన్వాడి కేంద్రాల సెలవుల సమయంలో కార్యకర్త ఇంటికి అంటించడం కూడా అధికారుల నిరంకుశ వైఖరికి నిదర్శనం అన్నారు. కార్యకర్త పద్మను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త అంగన్వాడి కార్యకర్తల యూనియన్ తరపున ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు ఎం సత్యవేణి, సీత, అప్పలరాజు, నూకరత్నం, శంఖవరం రౌతులపూడి మండలాల అంగన్వాడి కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

# నిరంతర శ్రామికుడు గుత్తా హరి జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమాలు

**అనంతపురము, మే 17, జనస్వరం :** నల్లాని రాజేశ్వరి ఫౌండేషన్ సిఇఓ గుత్తా హరి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ప్రముఖ విద్యావేత్త, ఫౌండేషన్ ముఖ్య సలహాదారు గొర్తి వెంకటస్వామి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రి వద్ద పండ్లు పంపిణీ చేశారు. పలు కాలనీల్లో పచ్చదనం - పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ప్రజా సమాఖ్య అధ్యక్షులు, హెడ్మాష్టర్ గొర్తి వెంకటస్వామితో పాటు, సాయి ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ విజయ సాయి కుమార్, పలువురు కవులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. పి. రమేష్ నారాయణ, ప్రముఖ విద్యావేత్త నల్లాని రాజేశ్వరి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షల సందేశం పంపించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ, గుత్తా హరి సేవలను ప్రశంసించారు. నల్లాని రాజేశ్వరి ఫౌండేషన్ సిఇఓగా, ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ జాతీయ అధ్యక్షులుగా, శ్రీశ్రీ కళావేదిక జాతీయ ఉపాధ్యక్షులు, ఎపి రాష్ట్ర అధ్యక్షులుగా, సాహిత్య భారతి అధ్యక్షుడిగా ప్రముఖ కవి, రచయిత, సామాజిక కార్యకర్త గుత్తా హరిసర్వోత్తమ నాయుడు విశేష సేవలందిస్తున్నారని వివరించారు. అంకితభావంతో నిరంతర కృషి కొనసాగిస్తున్న గుత్తా హరిసర్వోత్తమ నాయుడు అంచెలంచెలుగా ఎదుగుతున్నారని చెప్పారు. జిల్లా రచయితల సంఘం (జిరసం) అధ్యక్షుడుగా, ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా, జిల్లా కార్యదర్శిగా వివిధ బాధ్యతల్లో సుదీర్ఘకాలం





కొనసాగారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ (ఎపిజిపి) రాష్ట్ర సభ్యులుగా తనదైన శైలిలో సేవలందించారన్నారు. శ్రీశ్రీ కళావేదిక నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రపంచ రికార్డు సభల్లో తనవంతు భాగస్వామ్యం వహిస్తున్నారని పేర్కొన్నారు.

ఎన్.ఆర్.ఐ. ఫౌండేషన్ సి.ఈ.ఓ.గా, వనిత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులుగా, అనంత సాహితీ ప్రస్థానం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా బహుముఖ సేవలందిస్తున్నారని వివరించారు. అధికార భాషా సంఘం జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సభ్యులుగా, ఉదయ్ విద్యాసంస్థల సిఈఓగా, ఏపి చిన్న - మధ్య తరహా పత్రికల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ గా పనిచేశారన్నారు. సాహిత్య భారతి అధ్యక్షులుగా, మహాత్మా గాంధీ సేవా ట్రస్ట్ ప్రధానకార్యదర్శిగా కొనసాగుతున్నారన్నారు. గుత్తా హరి రాస్తున్న కవితలు, వ్యాసాలు పలు పత్రికలు, ప్రత్యేక సంచికల్లో ప్రచురితమవుతున్నాయన్నారు. ఆయన రచనలు, సేవలకు గుర్తింపుగా ఇప్పటికే పలు అవార్డులు, సత్కారాలు లభించాయన్నారు. 2012 జనవరిలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డును అప్పటి కలెక్టర్ వి. దుర్గాదాస్ చేతులమీదుగా అందుకున్నారని చెప్పారు. శ్రీశ్రీ కళావేదిక సభల్లో పలు పురస్కారాలు, సత్కారాలు పొందారని, పలు సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థలు అనేకసార్లు ఘనంగా సత్కరించాయని వివరించారు.

# కార్యకర్త శ్రేయస్సే... జనసేన శ్రేయస్సు - వాసగిరి మణికంఠ

**- గుంతకల్ నియోజకవర్గ వాలంటీర్లకు కిట్లు పంపిణీ చేసిన సమన్వయకర్త వాసగిరి మణికంఠ.**
**- కుటుంబాలకు అండగా నిలిచిన పవన్ కళ్యాణ్‌కు జనసైనికుల నుంచి కృతజ్ఞతలు.**
**- కష్టకాలంలో తోడ్పడ్డ క్రియాశీలకులకు ప్రశంసాపత్రాలు పంపిన పవన్ కళ్యాణ్.**
**- అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసిన పవర్ శేఖర్, బండి చంద్రకళశేఖర్‌కు ప్రత్యేక ప్రశంసలు.**



**గుంతకల్, మే 17, జనస్వరం :** గుంతకల్ పట్టణం, కసాపురం రోడ్డులో గుంతకల్ నియోజకవర్గ జనసేన పార్టీ క్యాంపు కార్యాలయంలో, సమన్వయకర్త వాసగిరి మణికంఠ ఆధ్వర్యంలో, పార్టీ అబ్జర్వర్ల పరిశీలనలో పామిడి, గుత్తి, గుంతకల్ మండలాలకు చెందిన క్రియాశీలక సభ్యత్వ నమోదు చేసిన వాలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ, జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళల కుటుంబాలకు అండగా ఉండేందుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రారంభించిన "5 లక్షల రూపాయల జీవిత భీమా" మరియు "50 వేల రూపాయల ప్రమాద భీమా"కు సంబంధించిన క్రియాశీలక సభ్యత్వ ఐడి కార్డులు మరియు ప్రశంసాపత్రాలను కేంద్ర కార్యాలయం సూచనల మేరకు పంపిణీ చేసినట్లు తెలిపారు. క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వారికి భద్రతా భరోసాను ఈ మెంబర్షిప్ అందిస్తుందని చెప్పారు. ఇంత గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రతి జనసేన కుటుంబానికి అండగా ఉన్న పవన్ కళ్యాణ్‌కు జనసైనికుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ పట్టణ అధ్యక్షుడు బండి శేఖర్, గుత్తి మండల మరియు పట్టణ అధ్యక్షులు పోతురాజుల చిన్న వెంకటేశులు, పాటిల్ సురేష్, జిల్లా కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యులు పవర్ శేఖర్, ఎస్ కృష్ణ, 50 మంది క్రియాశీలక వాలంటీర్లు పాల్గొన్నారు. అలాగే పామిడి, గుత్తి, గుంతకల్ మండలాల నుంచి జనసేన కుటుంబ సభ్యులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.






# వాలంటీర్లకు కిట్లు పంపిణీ చేసిన ఉరవకొండ నియోజకవర్గ ఇంచార్జి గౌతమ్ కుమార్

*** ఉరవకొండలో క్రియాశీలక వాలంటీర్లకు కిట్లు పంపిణీ చేసిన ఇంచార్జి గౌతమ్ కుమార్.**
*** క్రియాశీలక కుటుంబాలకు అండగా ఉన్న పవన్ కళ్యాణ్‌కు జనసైనికుల కృతజ్ఞతలు.**
*** కష్టకాలంలో పార్టీకి తోడుగా ఉన్నవారికి ప్రశంసాపత్రాలు పంపిణీ.**
*** అత్యధిక సభ్యత్వాలు చేసినవారికి జనసేన తరపున ప్రత్యేక ప్రశంసలు.**

**ఉరవకొండ, మే 17, జనస్వరం :** ఉరవకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఇంచార్జి గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో, పార్టీ ప్రతినిధుల పరిశీలనలో, ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాలు — ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్, కూడర్, బెళుగుప్ప — కి చెందిన క్రియాశీలక సభ్యత్వ నమోదు చేసిన వాలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ కుమార్ మాట్లాడుతూ, జనసేన నాయకుల, జనసైనికుల, వీర మహిళల కుటుంబాలకు అండగా ఉండేందుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రారంభించిన "5 లక్షల రూపాయల జీవిత భీమా" మరియు "50 వేల రూపాయల ప్రమాద భీమా" కు సంబంధించిన క్రియాశీలక సభ్యత్వ ఐడీ కార్డులు, ప్రశంసా పత్రాలు కేంద్ర కార్యాలయం సూచనల మేరకు పంపిణీ చేశామని తెలిపారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారి భద్రత, భవిష్యత్తుకు ఈ మెంబర్షిప్ భరోసా ఇస్తుందని అన్నారు. ఇంత మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన పవన్ కళ్యాణ్‌కు ప్రతి జనసేన కుటుంబ సభ్యుడి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జి గౌతమ్ కుమార్, ఉరవకొండ కన్వీనర్ చంద్రశేఖర్, విడపనకల్ కన్వీనర్ గోపాల్, బెలుగుప్ప కన్వీనర్ సుధీర్, నాయకులు దేవేంద్ర, రాజేష్, రమేష్, హరి శేకర్, కృష్ణ, మణి, రఘు, అభి, భీమా, ధనుంజయ, బోగేష్, సోము, అజయ్, చిరంజీవి, రవి నాయక్, ప్రసాద్, మోహన్, సాయి, శివ, రాము తదితరులు పాల్గొన్నారు.






# ఆపరేషన్‌పై పాకిస్థాన్‌కు ముందే సమాచారం ఇచ్చారన్న రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కేంద్రం స్పందన

ఆపరేషన్ సిందూర్ పై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. ఆపరేషన్‌పై ముందే పాకిస్థాన్‌కు సమాచారం ఇవ్వడం 'నేరం' అంటూ రాహుల్ చేసిన ఆరోపణలను కేంద్ర విదేశాంగ శాఖ, బీజేపీ తీవ్రంగా ఖండించాయి. రాహుల్ గాంధీ తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని బీజేపీ ఆరోపించింది. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మాట్లాడిన ఒక వీడియోను పంచుకున్నారు. మే 6, 7 తేదీల మధ్య రాత్రి జరిగిన ఆపరేషన్ సిందూర్ సమయంలో, ఉగ్రవాద స్థావరాలపై మాత్రమే దాడి చేస్తున్నామని, సైనిక స్థావరాలపై కాదని పాకిస్థాన్‌కు సందేశం పంపామని జైశంకర్ ఆ వీడియోలో చెప్పినట్లు ఉంది. "ఆపరేషన్ మొదలైనప్పుడు, మేము ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తున్నామని, సైన్యంపై కాదని పాకిస్థాన్‌కు సందేశం పంపాము. ఈ ప్రక్రియలో జోక్యం చేసుకోకుండా సైన్యం దూరంగా ఉండే అవకాశం వారికి ఉంది. కానీ వారు ఆ మంచి విషయాన్ని పరిగణనలోకి తీసుకోలేదు" అని జైశంకర్ ఆ వీడియోలో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను ఉటంకిస్తూ, దాడి ప్రారంభంలోనే పాకిస్థాన్‌కు సమాచారం ఇవ్వడం నేరం అని రాహుల్ ఆరోపించారు. "విదేశాంగ మంత్రి స్వయంగా భారత ప్రభుత్వం ఈ పని చేసిందని బహిరంగంగా ఒప్పుకున్నారు" అని గాంధీ మండిపడ్డారు.



పాకిస్థాన్‌తో ఈ సమాచారాన్ని పంచుకోవడానికి ఎవరు అధికారం ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. అంతేకాకుండా, "దీని ఫలితంగా మన వైమానిక దళం ఎన్ని విమానాలను కోల్పోయింది?" అంటూ రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వ్యాఖ్యలపై కేంద్రం, బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఈ వివాదంపై కేంద్ర విదేశాంగ శాఖ శనివారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేసింది. వాస్తవాలను తప్పుగా చిత్రీకరిస్తున్నారని పేర్కొంది. "ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైన తర్వాత తొలి దశలోనే పాకిస్థాన్‌ను హెచ్చరించామని విదేశాంగ మంత్రి స్పష్టంగా చెప్పారు. దీనిని ఆపరేషన్ ప్రారంభానికి ముందే అన్నట్లు తప్పుగా ప్రచారం చేస్తున్నారు. ఈ వాస్తవ వక్రీకరణను తీవ్రంగా ఖండిస్తున్నాం" అని విదేశాంగ శాఖ తమ ప్రకటనలో స్పష్టం చేసింది.